
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

KHAMMAM

బుధవారం, 13 మార్చి 2024

5

మంగళవారం ఉష్ణోగ్రత




	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	26	37
భద్రాద్రి	24	37

రంజాన్ మాసం



ఇఫ్తార్ : 6:24 (బుధవారం)
సహర్ : 4:57 (గురువారం)



6

3.50 లక్షల ఓట్ల మెజారిటీ ఖాయం

ఖమ్మం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు హస్తం గూటికి చేరుకున్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీ స్థానాన్ని 3.50 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుచుకుంటామని స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకు మించి ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

-ఖమ్మం సంక్షేమ విభాగం



6

వచ్చేసింది మరో 'వందేభారత్'

ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులకు మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వచ్చింది. సికింద్రాబాద్ - విశాఖపట్నం వరకు కేంద్ర ప్రభుత్వం ఈ రైలును ఏర్పాటు చేయగా, మంగళవారం నగర మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జండా ఊపి ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందేభారత్ (02707) ఉదయం 7.43 గంటలకు, విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే వందేభారత్ (02708) రాత్రి 8:03 గంటలకు ఖమ్మం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది.

- ఖమ్మం మామిళ్లగూడెం

సాకారమవుతున్న స్వప్నం



- వైరా రిజర్వాయర్‌కు సీతారామ ప్రాజెక్టు నీళ్లు
- గోదావరి-కృష్ణా అనుసంధానానికి మార్గం సుగమం
- రూ.99 కోట్లతో లింక్ కెనాల్ నిర్మాణానికి రంగం సిద్ధం
- పనులు పూర్తయితే 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు
- వైరా రిజర్వాయర్ కుడికాల్వ ప్రధాన లాకుల వద్ద నేడు శంకుస్థాపన
- పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్

వైరా, మార్చి 12: మరి కొద్దినెలల్లోనే ఉమ్మడి జిల్లాలోని సాగు భూములు గోదావరి జలాలతో తడవనున్నాయి. యుద్ధప్రాతిపదికన సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కాల్వ నిర్మాణంతో వైరా రిజర్వాయర్, లంకాసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లోని ఆయకట్టుకు సాగునీటి సమస్య తొలగిపోనుంది. 1,800 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో రూ.99 కోట్లతో సుమారు 9 కిలోమీటర్ల పొడవున ఈ లింక్ కాల్వను నిర్మించనున్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి కావడానికి రూ.వేలకోట్ల నిధులు, ఏళ్ల తరబడి సమయం పట్టనుండటంతో అప్పటివరకు వేచిచూడకుండా తాత్కాలిక లిఫ్టుల ద్వారా రూ.99కోట్లతో 1.25లక్షల ఎకరాలకు సాగునీటిని, ప్రజలకు తాగునీటికి అందించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు 9 కిలోమీటర్ల మేర కాల్వ నిర్మాణానికి బుధవారం వైరా రిజర్వాయర్ కుడికాల్వ ప్రధాన లాకుల వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. వైరాకు గోదావరి జలాల రాకతో తెలంగాణ నుంచి గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం జరగనుంది. సుమారు మూడు దశాబ్ధాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి పాయ పథకం ద్వారా గోదావరి, కృష్ణానదుల అనుసంధానానికి చేపట్టిన ప్రక్రియ ఇప్పుడు పూర్తయ్యే అవకాశముంది. ఈ గోదావరి జలాల వల్ల ఉమ్మడి ఖమ్మంజిల్లాతోపాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని అనేక మండలాలకు కూడా సాగు, తాగునీరు అందనుంది.

రూ.99కోట్లతో కాల్వ నిర్మాణం

సీతారామ ప్రాజెక్టు కాల్వ వందో కిలోమీటర్ అయిన వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడ్ మండలం వినోభానగర్ నుంచి దాదాపు 9కిలోమీటర్ల కాల్వను ఏన్కూరు మండలం తిమ్మారావుపేట సమీపంలోని ఎన్నెస్పీ 21మెయిన్ బ్రాంచ్ కెనాల్ 52వ కిలోమీటర్ సమీపంలో యూటీ వద్ద కలపనున్నారు. 9మీటర్ల వెడల్పు, 4మీటర్ల లోతుతో సుమారు 9కిలోమీటర్ల కాల్వను 1,800క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మించనున్నారు. 9కిలోమీటర్ల ఈ లింక్ కాల్వ ద్వారా జూలూరుపాడ్ మండలంలోని జూలూరుపాడ్, వినోభానగర్, ఏన్కూరు మండలంలోని ఇమామ్‌నగర్, రేపల్లెవాడ, ఏన్కూరు, నాచారం తదితర గ్రామాల రైతులకు చెందిన ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అలాగే వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులు, ఎన్నెస్పీ ఆయకట్టు మొత్తం 1.18లక్షల ఎకరాలకు ఈ గోదావరి జలాలను అందించే అవకాశముంది. మొత్తంగా 1.25లక్షల ఎకరాలకు ఎన్నెస్పీ నీటితో సంబంధం లేకుండా గోదావరి జలాలను నిరంతరాయంగా సరఫరా చేయటానికి వీలు కలుగుతుంది.

లబ్ధిపొందే ప్రాంతాలు

ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నాటికి వినోభానగర్ నుంచి తిమ్మారావుపేట వరకు కాల్వ నిర్మించి గోదావరి జలాలను సరఫరా చేసిన పక్షంలో జూలూరుపాడ్, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, అలాగే వైరా, తల్లాడ, బోనకల్, ఎర్రుపాలెం, మధిర మండలాలతోపాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన తిరువూరు, గంపలగూడెం, వీరులపాడు మండలాలకు సాగు, తాగు నీరు సరఫరా అవుతుంది. అంతేకాకుండా వైరా రిజర్వాయర్ నుంచి నది ద్వారా వెళ్లే గోదావరి జలాలు కృష్ణానదిలో కలవనున్నాయి. మొత్తంగా వైరా నుంచి నయాపైసా ఖర్చు లేకుండా గోదావరి జలాలు కృష్ణానదికి ప్రవహించనున్నాయి.



సభాస్థలి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తదితరులు

ఇక పుష్కలంగా నీళ్లు: ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్ కుడికాల్వ ప్రధాన లాకుల వద్ద సీతారామ ప్రాజెక్టు కాల్వ నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపనచేయనున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీబీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారామ నీటితో వైరా రిజర్వాయర్‌లో 365రోజులు పుష్కలంగా నీటిలభ్యత ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడ్, కారేపల్లి మండలాలకు కూడా ఈ నీటిని అందించటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తన విజ్ఞప్తికి స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ప్రత్యామ్నాయ కాల్వ నిర్మాణానికి రూ.100కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం జరిగే శంకుస్థాపన కార్యక్రమం, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, సీతారామ ప్రాజెక్టు ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, ఏఈఈ కార్తీక్, హరికృష్ణ, మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు, వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, సీతరాములు, నాయకులు కట్ల రంగారావు, దాసరి దానియేలు, దొడ్డా పుల్లయ్య, వడ్డే నారాయణ, మచ్చా బుజ్జి, బీడీకే.రత్నం, పమ్మి అశోక్, కొండలు, పణితి శ్రీను, పాలేటి నర్సింహారావు, హరినాథ్, బోళ్ల గంగారావు, మల్లు రామకృష్ణ, కట్ల సంతోష్, వేమూరి పుల్లారావు పాల్గొన్నారు.

వర్షాకాలం లోపు పూర్తిచేయాలి..

- భద్రాచలంలో మిగిలిన కరకట్ట పనులపై సీఎం
- హైదరాబాద్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష



ఖమ్మం/భద్రాచలం మార్చి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భద్రాచలం పట్టణానికి గోదావరి వరద సమస్య తలెత్తకుండా వచ్చే వర్షాకాలంలోగా కరకట్ట పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలను ఆదేశించారు. ఈమేరకు నీటి పారుదల శాఖ అధికారులు విడుదల చేసిన ఒక ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. భద్రాచలంలో ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలంలో మిగిలి ఉన్న కరకట్ట పనులు పూర్తిచేయాలని, దాని ఆవశ్యకత గురించి సీఎంకు వివరించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ముఖ్యమంత్రి చర్చించి వచ్చే వర్షాకాలంలోగా మిగిలి ఉన్న కరకట్ట పనులు పూర్తిచేయాలని నీటిపారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ప్రియాంకఅల తదితరులను ఆదేశించారు. దీంతో జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు వచ్చే వర్షాకాలం నాటికి టెండర్లు పూర్తయి నిధులు మంజూరు జరిగి ఉన్న గోదావరి కరకట్ట మిగిలిన పనులను పూర్తి చేయబోతున్నారు.

తేట 'తెల్లం'..



- కాంగ్రెస్ 'ప్రజాదీవెన' సభా వేదికపై భద్రాచలం ఎమ్మెల్యే

భద్రాచలం, మార్చి 12: బీఆర్ఎస్‌కు చెందిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తీరు మరోసారి రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చకు దారి తీసింది. భద్రాద్రి జిల్లాలో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలో భద్రాచలం ఎమ్మెల్యే పాల్గొనడం ఈ చర్చకు ప్రధాన కారణమైంది. భద్రాచలంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభ సభలో స్థానిక ఎమ్మెల్యేగా తెల్లం వెంకట్రావు పాల్గొనడం సాధారణ విషయమే అయినా మణుగూరులో జరిగిన కాంగ్రెస్ ప్రజాదీవెన సభకు సీఎం, మంత్రులతో కలిసి హెలికాప్టర్‌లో వెళ్లి ఆ సభలో వారిలో స్టేజీ పంచుకోవడం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. కాంగ్రెస్‌లో చేరే విషయాన్ని నిన్నమొన్నటి వరకు ఖండిస్తూ వచ్చిన ఎమ్మెల్యే తెల్లం భద్రాచలం (మిగతా 7వ పేజీలో)



రాజకీయ సంరంభం

- తరుముకొస్తున్న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్
- పార్టీలు, నాయకుల్లో సందడే సందడి
- జోరుగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- జనంలోకి అగ్రనాయకులు.. విస్తృతంగా పర్యటనలు
- అభ్యర్థుల ఖరారులో ప్రధాన పార్టీల తలమునకలు
- ఖమ్మం ఎంపీ అభ్యర్థిపై ఎటూ తేల్చని కాంగ్రెస్
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్
- ఇంకా దోలాయమానంలో బీజేపీ

6

లోక్‌సభ ఎన్నికల పోరుకు నేడో, రేపో తెరలేవనుండటంతో రాజకీయ సంరంభం జోరందుకుంది. ఎన్నికల షెడ్యూల్ జారీకి రంగం సిద్ధం కావడంతో ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ఒకవైపు అభ్యర్థుల ఖరారుకు కసరత్తు చేస్తూనే, అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులకు జోరుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. కోడ్ కూయక ముందే జాగ్రత్త పడుతున్నారు. విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. సోమవారం సీఎం రేవంత్ భద్రాచలంలో పర్యటించగా, బుధవారం నలుగురు మంత్రులు వైరాలో లింక్ కెనాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఇక ఖమ్మం ఎంపీ స్థానానికి బీఆర్ఎస్ ఇప్పటికే నామా నాగేశ్వర్‌రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా, కాంగ్రెస్, బీజేపీ ఎడతెగని కసరత్తు చేస్తున్నాయి. మరోవైపు మహబూబాబాద్ స్థానానికి కాంగ్రెస్ పోరిక బలరాంనాయక్‌ను, బీఆర్ఎస్ మాలోతు కవితను ప్రకటించగా, బీజేపీ ఇంకా ఎవరినీ తేల్చలేదు. మొత్తంమీద షెడ్యూల్ విడుదలకు ముందే లోక్‌సభ ఎన్నికలు కాకరేపుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం	
బీఆర్ఎస్	నామా నాగేశ్వర్‌రావు
కాంగ్రెస్	అభ్యర్థిని ఇంకా తేల్చలేదు
బీజేపీ	జలగం వెంకట్రావు పేరు పరిశీలనలో ఉంది

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం	
బీఆర్ఎస్	మాలోతు కవిత
కాంగ్రెస్	పోరిక బలరాం నాయక్
బీజేపీ	సీతారాంనాయక్ పేరు పరిశీలనలో ఉంది

'ఆయిల్‌ఫెడ్'ను తొలగించి ఆగం చేయొద్దు

- ఆయిల్‌పామ్ సాగును గోద్రెజ్ కంపెనీకి అప్పగిస్తే ఊరుకోం
- రాయితీలు రావు, కనీస ధర దక్కదు..
- సత్తుపల్లిలో ఆయిల్‌పామ్ రైతుల ఆందోళన
- మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయం

సత్తుపల్లి, మార్చి 12: ఖమ్మం జిల్లాలో ఆయిల్‌ఫెడ్ పరిధిలో ఉన్న ఆయిల్‌పామ్ ప్రాంతాన్ని గోద్రెజ్ కంపెనీ తమకు తప్పగించాలంటూ ముఖ్యమంత్రిని కోరుతూ లేఖ ఇవ్వడాన్ని ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల దావోస్‌లో జరిగిన సమావేశంలో పెట్టుబడులు పెడతామంటూ ముఖ్యమంత్రికి గోద్రెజ్ కంపెనీ హామీ ఇచ్చిందని, ఈ క్రమంలో ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో ఆ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలు పెంచడం కోసం అనుమతి పొందిందని రైతులు చెబుతున్నారు. ఇందులో భాగంగానే ఖమ్మంజిల్లాలో ఆయిల్‌ఫెడ్ పరిధిలో ఉన్న ఏరియాను గోద్రెజ్ కంపెనీకి అప్పగించాలని ముఖ్యమంత్రికి లేఖ ఇవ్వడంతో దీనిపై సీఎం కార్యాలయం నుంచి ఆయిల్‌ఫెడ్ అధికారులను నివేదిక అడిగినట్టు తెలుస్తోంది.

ఈ పరిణామాలను పామాయిల్ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జిల్లాలో 28వేల ఎకరాలు ఆయిల్‌పామ్ సాగులో ఉండగా 3500 ఎకరాలు గోద్రెజ్ కంపెనీ పరిధిలో ఉన్నాయి. మిగిలిన విస్తీర్ణం ఆయిల్‌ఫెడ్ పరిధిలో ఉంది. మొత్తం ఖమ్మం జిల్లాను గోద్రెజ్ కంపెనీకి అప్పగించడం వలన తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్‌ఫెడ్ పరిధిని తొలగించి గోద్రెజ్‌కు అప్పగిస్తే ఎటువంటి రాయితీలు ఉండవని, ఉన్నా ఆ కంపెనీ ఇవ్వదని రైతులు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు రూ.25కే ఇవ్వాల్సి ఉండగా రూ.213చొప్పున వసూలు చేస్తారని, ఆయిల్ రికవరీ శాతం కూడా తగ్గించి చూపడం వలన రైతులకు కనీస ధర కూడా రాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతం ఆయిల్‌ఫెడ్ పరిధిలో ఉన్న కారణంగా ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పామాయిల్ ఫ్యాక్టరీలలో సగటున 19శాతం పైగా రికవరీ ఉంటుందని, గతంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఇదే రకంగా ప్రైవేట్ కంపనీలకు పామాయిల్ ప్రాంతాన్ని అప్పగించడంతో గుత్తాధిపత్యం వలన రైతులు నష్టపోయారని గుర్తు చేస్తున్నారు. గోద్రెజ్ కంపెనీకి ఖమ్మం జిల్లా ఆయిల్‌ఫెడ్ ప్రాంతాన్ని అప్పగిస్తే ఆందోళన చేస్తామని రైతులు ఆందోళన చేస్తున్నారు.



సత్తుపల్లిలో సమావేశమైన ఆయిల్‌పామ్ సంఘ రైతులు

రైతుసంఘం సమావేశం

ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులు మంగళవారం రాత్రి ఆయిల్‌పామ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ అధ్యక్షతన సత్తుపల్లిలోని స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో సమావేశ మయ్యారు. గోద్రెజ్‌కు ఆయిల్‌ఫెడ్ ప్రాంతాన్ని అప్పగించవద్దంటూ తీర్మానం చేశారు. ఈ సమస్యను వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌పామ్ రైతులు వేంపాటి లక్ష్మీనారాయణ, బండి గురువారెడ్డి, చలసాని సాంబశివరావు, బండి గుర్నాధరెడ్డి, చల్లగుళ్ల నరసింహారావు, ఆళ్ల నాగేశ్వరరావు, పాకలపాటి శ్రీనివాసరావు, ప్రసాద్ రెడ్డి, విష్ణు, చీకటి చిట్టీరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



7

అడవి పందిని తప్పించబోయి..

- పల్టీ కొట్టిన కూలీల ఆటో
- ఒకరి మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు

6

బీటీపీఎస్‌పై విచారణ



- క్యాబినెట్ మీటింగ్‌లో నిర్ణయం
- ఆది నుంచీ సాంకేతిక సమస్యలే..

బీటీపీఎస్‌పై విచారణ..

- క్యాబినెట్ మీటింగ్‌లో నిర్ణయం
- ఆది నుంచి సాంకేతిక సమస్యలే..
- పెట్టుబడులెక్కువ..ఉపయోగం తక్కువ
- విచారణలో వెలుగు చూడనున్న వాస్తవాలు

మణుగూరు, మార్చి 12: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వాలు చేపట్టిన పలు పథకాలపై వస్తున్న ఆరోపణలను సిరియస్‌గా తీసుకుని యాక్షన్‌ను ప్రారంభించింది. టీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో నాటి విద్యుత్ అవసరాల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉత్పాదన కేంద్రాల ఏర్పాటులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో భద్రాద్రి థర్మల్ స్టేషన్‌ను నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపనలు చేశారు. 1080 మెగా వాట్ల సామర్థ్యంలో ఈపవర్ స్టేషన్‌కు అంకురార్పణ జరిగింది. 270 మెగా వాట్ల పవర్‌ను జనరేట్ చేసే విధంగా నాలుగు యూనిట్లను ఇక్కడ నిర్మాణాలు చేపట్టారు.

కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీతో ప్రాజెక్టు నిర్మాణం

అయితే అప్పటికే కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ఉత్పాదన కేంద్రాలల్లో వాడే సబ్ క్రిటికల్ విధానాలను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. సబ్ క్రిటికల్ వ్యవస్థ వల్ల ప్రజలకు పర్యావరణానికి తీవ్ర ఇ బ్బందులు కలుగుతున్నాయని, పంటలపై ప్రజల ఆరోగ్యాలపై పర్యావరణ సమతుల్యతపై కూడా ఈ విధానాల వల్ల ప్రభావం పడి దెబ్బతింటున్నాయన్న అంశంపై సబ్ క్రిటికల్ వ్యవస్థలను నిలిపి వేయాలని ఇకపై ఏర్పాటు చేసే విద్యుత్ ఉత్పాదన కేంద్రాల్లో సూపర్ క్రిటికల్ విధానాలను ఏర్పాటు చేయాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలు ఉన్నానే పథ్యంలో కూడా పవర్ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు వహించే బీహెచ్ఈఎల్ కంపెనీ గతంలో మహరాష్ట్ర రాష్ట్రానికి చెందిన ఇండియన్ బుల్స్ ప్రైవేటు పవర్ ప్రాజెక్టులో 10 యూనిట్ల నిర్మాణాలకు చెందిన మెటిరియల్‌ను సమకూర్చగా అందులో ఆరు యూనిట్ల నిర్మాణాలు పూర్తి చేసింది, దీంతో నాలుగు యూనిట్ల మెటిరియల్ తమకు అవసరం లేదని తిరస్కరించింది. అప్పటికే రెండేళ్ల పాటు ఆరుబయట ఉన్న ఈ మెటిరియల్ తుప్పు పట్టే దశకు చేరుకున్నట్లు తెలిసింది. ఈ నాలుగు యూనిట్ల మెటిరియల్‌ను ఎలాగో వినియోగంలోకి తేవాలని యోచించిన బీహెచ్ఈఎల్ తెలంగాణలో విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుపై ప్రభుత్వ ఆలోచన అనుగుణంగా ఒప్పందాలను కుదుర్చుకుంది. సంబంధించిన మెటీరియల్ హ్యాదాగా ఉండటంతో దాన్నే ఇక్కడ ఏర్పాటు చేసిన భద్రాద్రి పవర్ స్టేషన్ ఏర్పాటులో ఆగమేఘాలపై తరలించి నిర్మాణాలను చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తోందన్న విషయాన్ని ముందుగానే తెలుసుకున్న నాటి ముఖ్య మంత్రి హాడావిడిగా శంకుస్థానలు చేసి నిర్మాణ బాధ్యతలను బీహెచ్ఈఎల్ కంపెనీకి అప్పగించడం. త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్న అగ్రిమెంట్ జరిగిపోవడం అన్ని చెకచెక జరిగిపోయాయి. బీహెచ్ఈఎల్ మణుగూరు బీటీపీఎస్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి పర్యావరణ అనుమతులు కేంద్రం నుంచి లేకపోయినా పవర్ స్టేషన్ నిర్మానాలు బేస్ లెవల్‌ను దాటిపోయాయి. ఎన్‌జీటీలో నమోదు అయిన కేసు నేపథ్యం దాదాపు మూడేళ్ల వరకు నిర్మాణ పనులను నిలిచిపోయాయి. ఇలా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోని బీటీపీఎస్ నిర్మాణాలు నాలుగు యూనిట్లు పూర్తి చేసుకుని 2023 నాటికి విద్యుత్ ఉత్పత్తిని చేసే స్థాయికి చేరుకున్నాయి. సబ్ క్రిటికల్ విధానంతో బీటీపీఎస్ నిర్మాణాలు ఉన్నాయని వీటిని వెంటనే నిలిపివేసి సూపర్ క్రిటికల్ విధాన నిర్మాణాలు చేపట్టాలని స్థానిక పలు రాజకీయ పార్టీలు కూడా బలంగా తమ వాణిని



మణుగూరులోని బీటీపీఎస్

వినిపించినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. నాటి నుంచి నేటి వరకు ప్లాంట్ నుంచి వెలువడే ధుమ్ము ధూళి మణుగూరు మండలం, పినపాక మండలాల రైతాంగ పంటలను, ఆరోగ్యాలను ఛిద్రం చేసేస్తున్నాయి. ఈ ప్లాంట్‌లో పవర్ జనరేషన్‌కు అయ్యే ఖర్చు ఎక్కువ ఉత్పత్తి అయ్యే విద్యుత్ నుంచి వచ్చే ఆదాయం తక్కువ అనే వ్యాఖ్యలు తీవ్ర స్థాయిలో వినిపిస్తండటం, నిర్మాణ పనుల్లో చోటు చేసుకుంటున్న విషయంలో కోట్లాది రూపాయాల నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాద్రి, యాద్రాద్రి పవర్ స్టేషన్లపై సమగ్రమైన విచారణ చేపటడతామి అక్రమార్కులను భరతం పడతామని ఆదినుంచి పేర్కొంటూ వస్తోంది. ఈక్రమంలో మంగళవారం రాష్ట్ర క్యాబినేట్‌లో సమగ్ర విచారణ చేపట్టాలని గట్టి నిర్ణయాన్ని కూడా తీసుకోవడం జరిగింది. ఇక నేడో రేపో ఈ ప్రాజెక్టు తీరు తెన్నులు, నిర్మాణ వ్యయ వివరాలు తదితర అంశాలపై సునిసిత పరిశీలనలు చేయనున్నట్లు తెలుస్తోంది.

రాజకీయ సంరంభం

- తరుముకొస్తున్న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్
- అభ్యర్థుల ఖరారులో ప్రధాన పార్టీల తలమునకలు
- జనంలోకి అగ్రనాయకులు.. విస్తృతంగా పర్యటనలు



ఖమ్మం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మరో 9మంది కేబినేట్ మంత్రుల బృందం భద్రాచలం రావడం, భద్రాచల క్షేత్రంలోని సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకోవడం, అక్కడే రూ.5 లక్షల ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. పనిలో పనిగా భద్రాచలం కరకట్ట పనులు పూర్తికి, భద్రాచల ఆలయ అభివృద్ధికి, భద్రాచలంలోని ఐదు పంచాయతీల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. మణుగూరులో నిర్వహించిన ప్రజాదీవెన సభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో అధికారికంగానే శ్రీకారం చుట్టింది. మహబాద్ లోక్‌సభ అభ్యర్థి బలరాంనాయక్ పేరును ప్రకటించడంతో పాటు లక్షా 50వేల మెజారిటీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

మరోవైపు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక కోసం ఢిల్లీలో కసరత్తు ప్రారంభమైంది. జిల్లా నుంచి ఆశావహులు అనేక మంది ఉండడం, ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులు టికెట్లు ఆశిస్తుండడంతో కాంగ్రెస్ అధిష్టానంకు సైతం పెద్ద సమస్యగా మారింది. జిల్లాకు చెందిన వారికి టికెట్ ఇస్తారా లేక బయట నుంచి కొత్త వ్యక్తులు వస్తారా అన్నదానిపై చర్చ సాగుతుంది.

ఒకవైపు అభ్యర్థి ఎంపిక కసరత్తు సాగుతుండగా మరో వైపు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసపరెడ్డిలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు సాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ వస్తుందని గమనించి ప్రజా ప్రతినిధులంతా అలర్ట్ అయ్యారు. వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను అనుసంధానం చేసే లింక్ కెనాల్ పనులు డిప్యూటీ సీఎం భట్టితో పాటు మంత్రులు శంకుస్థాపన చేయబోతున్నారు. ఇటీవల మధిర నియోజకవర్గంలో భట్టి విక్రమార్క, పాలేరులో పొంగులేటి, ఖమ్మం నియోజవర్గంలో తుమ్మల తమ నియోజకవర్గాల్లో మంజూరైన రహదారుల పనులకు శంకుస్థాపనలు చేశారు. అధికారులతో రివ్యూ సమావేశం పెట్టి మంచినీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలపై దృష్టి సారించారు.

నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా తమ కోటా కింద మంజూరైన నిధుల పనులకు శంకుస్థాపనలతో బిజీగా ఉన్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తేలకపోయినా తమ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల ఆధిక్యతను మళ్లీ చూపించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారు. ఇక విపక్ష బీఆర్ఎస్ అభ్యర్థులుగా ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మాలోతు కవితలకు టికెట్లు దక్కాయి. ఇటీవల ఖమ్మంలో లోక్‌సభ స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం జరగ్గా రాజ్యసభకు ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర అభినదన సభతో ఎన్నికల ప్రచార సభను కూడా బీఆర్ఎస్ నిర్వహించింది. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వర్‌రావు తన కుమారుడి వివాహ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. వివాహం తర్వాత ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతున్నారు.

ఇక బీజేపీ కూడా ఎన్నికల శంఖారావం పూరించబోతుంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి జలగం వెంకటరావు, మహబాద్‌కు సీతారాంనాయక్ పేర్లు ఫైనల్‌లో ఉన్నాయి. రేపో మాపో వీరి పేర్లు ఖరారవుతాయని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అభ్యర్థుల పేర్లు వెల్లడి కాగానే కమల దళం కూడా లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోకి అడుగు పెట్టబోతుంది. కేంద్ర మంత్రులు విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు అగ్ర నేతలు ప్రదాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం లేకపోలేదు. ఇక వామపక్షాలు తాము ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటనలు ఇస్తున్నాయి. పొత్తులో ఒక స్థానమైనా కేటాయించాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నా కాంగ్రెస్ నుంచి సానుకూల స్పందన లేదు. సీపీఎం ఒంటరిగా పోటీ చేస్తామని చెబుతున్నా ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు.

పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖమ్మంకలెక్టరేట్/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి) మార్చి 12: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ఓటరు దరఖాస్తులు వంటి పలు అంశాలపై ఆయన మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, రాబోయే పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాలు, నామినేషన్ల ప్రక్రియ పోలింగ్ సిబ్బంది శిక్షణ లాంటి అన్ని అంశాలతో ప్రణాళిక రూపొందించాలని అన్నారు. పెండింగ్ దరఖాస్తులను ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని అన్నారు. ఓటర్ జాబితా సవరణలో భాగంగా మరణించిన వ్యక్తుల, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలి వెళ్లిన వారి ఓటు వివరాలు నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. ఓటరు జాబితాలో వచ్చే మార్పులపై ఎప్పటి కప్పుడు రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తూ వారికి సమాచారం అందించాలన్నారు. నూతన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నూతనంగా మంజూరు చేసిన ఓటర్ కార్డు వివరాలను వెంటనే సంబంధిత ప్రింటర్లకు అందజేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల షెడ్యూల్ ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలలో అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బంది సన్నద్ధం చేసుకోవాలని, ఇటీవల జరిగిన బదిలీల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొనే వివిధ బృందాల్లోని సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించు కునేందుకు భారత ఎన్నికల కమిషన్ 85 సంవత్సరాల పైగా వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించిందని, దీనికోసం ప్రత్యేకంగా సంబంధిత ఓటర్లు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఇంటి వద్ద ఓటు హక్కు కల్పించేందుకు ఏర్పాట్ల ప్రణాళిక తయారు చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో దివ్యాంగులను మ్యాపింగ్ చేసి పోలింగ్ రోజున వారికి అవసరమైన రవాణా సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెకర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్

సింగరేణిలో 1900 ఉద్యోగాల భర్తీకి ఏర్పాట్లు

- నూతన గనుల ఏర్పాటు కోసం ప్రత్యేక కృషి
- డిప్యూటి సీఎం మల్లుభట్టి విక్రమార్క

కొత్తగూడెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో ఈ ఏడాదిలో సింగరేణి ఆధ్వర్యంలో దాదాపు 1900 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఇంధన, ఆర్థిక ప్రణాళికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందులో భాగంగా గత వారంలో 489 ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, 1352 ఉద్యోగాల భర్తీకి అతి త్వరలో నోటిఫికేషన్లు విడుదల కానున్నట్లు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ బంజారాహీల్స్‌లో నిర్మించనున్న సింగరేణి అతిథిగృహ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 134 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణికి హైదరాబాద్‌లో గెస్ట్ హౌస్ లేకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు, అధికారుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. సింగరేణి విస్తరణ చర్యల్లో భాగంగా సింగరేణికాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జైపూర్‌లో నిర్వహిస్తున్న ప్రస్తుత 1200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో త్వరలో 800మెగావాట్ల సూపర్‌క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రామగుండంలో ఉన్న జెన్కో ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్లాంట్ ఆవరణలో 800మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కేంద్ర బొగ్గుశాఖ మంత్రిని కలిసి తాడిచర్ల 2 గనిని సింగరేణికి కేటాయించేందుకు విజ్ఞప్తి చేయగా సానుకూల స్పందన లభించిందన్నారు. అనంతరం సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి బలరాం మాట్లాడుతూ 134సంవత్సరాల చరిత్ర గల సింగరేణి సంస్థకు హైదరాబాద్‌లో సొంత గెస్ట్‌హౌస్ లేదని, రాష్ట్ర ప్రభుత్వం వారు గెస్ట్‌హౌస్ కోసం వెయ్యిగజాల స్థలాన్ని కేటాయించడమే కాక శంకుస్థాపనకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత 100రోజుల్లో సింగరేణిలో కార్మికుల సంక్షేమానికి, సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సకారంతో అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన సభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, మక్కన్ సింగ్‌రాజ్ ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజురుద్దీన్, జనక్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

అందుబాటులోకి మరో వందేభారత్ రైలు

ఖమ్మం మామిళ్లగూడెం, మార్చి 12: ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులకు మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వచ్చింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంవరకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ రైలు(02707)ను ఏర్పాటు చేసింది. మంగళవారం నగర మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా దేశవ్యాప్తంగా 10 రైళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య, స్వాతంత్ర్య స మరయోధుడు ఎం.వెంకటసుబ్బారెడ్డి, డీఎస్‌టీఈ ప్రార్థమేష్ కాకాడే, ఏసీఎం వి.రవికాంత్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జాఫర్, స్టేషన్ మేనేజర్ ఎన్వీ ప్రసాద్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జీఆర్పీ సీఐ వెంకటేశ్వర్లు, సీజీఎస్ఆర్ ప్రసన్నకుమార్, సీపీఎస్ఆర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే సంస్థ పరిధిలో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందేభారత్ రెండో రైలు సర్వీసును మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఆరు రోజుల పాటు (గురువారం మినహా)ఈ వందేభారత్ రైలు నడుస్తుంది. గత ఏడాది నుంచి ఒక రైలు నడుస్తుండగా, దీనికి మంచి ఆదరణ లభిస్తుండటంతో ప్రయాణికుల ప్రయోజనం కోసం తాజాగా మరో రైలును అందుబాటులోకి తీసుకువచ్చారు. రైల్వే ప్రయాణికులు వందే భారత్ రైలును సద్వినియోగం చేసుకోవాలని సీసీఐ జాఫర్‌ఖాన్ కోరారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందేభారత్(02707) ఉదయం 7.43 గంటలకు, విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే వందేభారత్(02708) రాత్రి 8.03 గంటలకు ఖమ్మం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది.

3.50 లక్షల ఓట్ల మెజారిటీ ఖాయం

- డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 12: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పటిష్టమైన నిర్మాణం కలిగి 9 అసెంబ్లీ స్థానాలను కైవాసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు జరుగుతున్న చేరికలు అదనపు బలంగా మారతాయని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీ స్థానాన్ని 3.5లక్షల ఓట్ల మెజార్టీతో గెలుచుకుంటామని జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావీద్ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. దొండపాటి వెంకటేశ్వర్లుకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కాంగ్రెస్ కండువాను కప్పి కాంగ్రెస్‌లోకి స్వాగతించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దొండపాటి వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌తో దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. ఘర్ వాపస్ పిలుపులో బాగంగా తిరిగి కాంగ్రెస్‌లోకి చేర్చుకోవటం జరిగిందన్నారు. మధిర నియోజకవర్గంలో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు జావీద్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుచుకున్న ఓట్లకి మించిన స్థాయిలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటింగ్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, వడ్డె నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సెన్, మాజీ కార్పొరేటర్లు కమర్తపు మురళీ, చావా నారాయణరావు, నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, మద్ది వీరారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో
మహిళా సాధికారిత: సౌజన్య



ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 12: ఇందిరమ్మ రాజ్యంలో మరోసారి మహిళా స్వయం సహాయక సంఘా లు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సాధికారిత దిశగా అడుగులు ప్రారంభమయ్యాయని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళా శక్తి మహిళా స్వయం సహాయక సంఘాల సభ విజయవంతమైందని కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాలకు జీరో వడ్డీలను, రూ.5లక్షల వరకు ఉచిత ఇన్స్‌రెన్స్‌ను, మహిళలకు తక్కువ వడ్డీలకే రుణాలను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారని హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా మహిళల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు. మహిళలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన
డ్వాక్రా మహిళలు



ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 12: మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ప్రోత్సాహకాలను ప్రకటించేందుకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మహిళ లక్ష్మి పథకానికి ఖమ్మం జిల్లా నుంచి భారీగా మహిళలు తరలి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా 26 బస్సులను ఏర్పాటు చేసి 1200 మంది మహిళా స్వయం సహాయక సంఘాలను తరలించటం జరిగిందని డీఆర్డీవో సన్యాసయ్య తెలిపారు.

వైరా: హైదరాబాద్‌లో జరిగిన మహిళా సదస్సుకు వైరా నుంచి ప్రత్యేక బస్సుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు తరలివెళ్లారు. మునిసిపల్ కార్యాలయం వద్ద చైర్మన్, వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, కమిషనర్ వేణు జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, మార్చి 12: తీర్థాల జాతరకు వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన కందరబోయిన వరదరాజు వయసు(53) తన బావ అస్థికలు కలిపేందుకు ఈనెల 8న కుటుంబ సభ్యులతో కలిసి తీర్థాల జాతరకు వచ్చారు. కొంత సమయానికి వరదరాజు కనిపించలేదు. నాలుగు రోజుల నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు.. దీంతో వరదరాజు కనిపించడం లేదని అతని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తల్లాడ, మార్చి 12: తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో సోమవారం రాత్రి పోలీసులు దాడి చేసి అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్‌డీలర్ రామారావు దగ్గరి నుంచి మధు అనే వ్యక్తి 15బస్తాల్లోని ఏడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండల్‌రావు తెలిపారు.

'కక్షిదారులకు అవగాహన కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి జావీద్‌పాషా

ఖమ్మం లీగల్, మార్చి 12: జిల్లా వ్యాప్తంగా మార్చి 16న నిర్వహించబోయే జాతీ య లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీసు కోర్టు డ్యూటీ అధికారులపై ఉందని జిల్లా న్యాయసేవాదికాసంస్థ కార్యదర్శి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అన్నారు. మంగళవారం భోజన విరామ సమయంలో న్యా యాధికారి కోర్టు డ్యూటి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలన్నారు. రాజీ పడకుండా కోర్టులలో కేసు నడిచినట్లయితే, కోర్టులో సాక్ష్యాదారాల నమోదు మొదలైన మొదటి రోజు నుంచి తీర్పు వచ్చేవరకు ఇరువురి కక్షిదారులు ఎంతో ఒత్తిడికి గురవుతారన్నారు. అంతేకాకుండా వారి విలువైన సమయం కూడా వృథా అవుతుంది కాబట్టి రాజీమార్గం అనే అంశాన్ని వారికి వివరించాలన్నారు. జాతీ య లోక్‌అదాలత్ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 14 లోక్‌అదాలత్ బెంచిలను ఏర్పాటు చేశామని ఇందులో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, చెల్లని చెక్కు కేసులు, సైబర్‌క్రైమ్ కేసులు పరిష్కారమయ్యే అవకాశం ఉన్నందున అందరూ వీటిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైజన్ అధికారి మోహన్‌రావు పాల్గొన్నారు.

రైతునేస్తంతో రైతులకు ఉపయోగాలు: డీఏవో

కొణిజర్ల, మార్చి12: ప్రభుత్వం రైతుల అవసరార్థం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంతో రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని వైరా నియోజకవర్గస్థాయిలో మండల పరిధిలోని తనికెళ్ల రైతువేదికలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును ప్రసంగాన్ని అధికారులు వీడియోకాన్ఫిరెన్స్ ద్వారా విన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, సతీష్, ఏవోలు బాలాజీ, పవన్‌కుమార్, నరసింహరావు, ఉమామహేశ్వర రెడ్డి, వాహిని, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఆదివాసీల అస్తిత్వం కోసమే మానుకోట నుంచి బరిలోకి

- జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ చందా లింగయ్య దొర

భద్రాచలం మార్చి 12: ఆదివాసీల అస్తిత్వం కోసమే మహబూబాబాద్ పార్లమెంటు నుంచి బరిలోకి దిగుతున్నామని జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్, ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్య దొర అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ ఆదివాసీ అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థిగా ఆదివాసీ సంఘాల అభ్యర్థి పోటీలో ఉంటారని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి హతం

సత్తుపల్లిరూరల్, మార్చి12: కుక్కల దాడిలో చుక్కల దుప్పి హతమైన సంఘటన సత్తుపల్లి మునిసిపాలిటీలో మంగళవారం జరిగింది. సత్తుపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ముత్తి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నీలాద్రి అర్బన్ పార్క్ లోపల వేంసూర్ రోడ్డు వైపు వీధి కుక్కలు చుక్కల దుప్పిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికుల సమాచారంతో పార్క్‌లోనే దుప్పికి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. దుప్పి కళేబరాన్ని పట్టణ శివారులోని అటవీ ప్రాంతంలో దహనం చేసినట్లు ఎఫ్‌బీవో తెలిపారు.



మృతి చెందిన చుక్కల దుప్పిని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రవికుమార్

కారేపల్లి, మార్చి12: పిల్లలను హాస్టల్లో దింపి వస్తూ ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరి గింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలంపల్లి గ్రామానికి చెందిన తేజావత్ రవికుమార్(35) ద్వి చక్ర వాహనంపై తన కుమారులను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో దింపి ఇంటికి వస్తుండగా, హలియాతండా వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కిందపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలింగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారాం తెలిపారు.

ఫిట్స్‌తో విద్యుత్ కాంటింజెంట్ వర్కర్ ...



సుధాకర్ మృతదేహం

నేలకొండపల్లి, మార్చి12: ఫిట్స్‌తో విద్యుత్ కాంటింజెంట్ వర్కర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన అడపాల సుధాకర్(33) ద్విచక్ర వాహనంపై నేలకొండపల్లికి వచ్చి వెళ్తుండగా, ఫిట్స్ వస్తుండడంతో రోడ్డు పక్కన ఉన్న బల్లపై పడుకున్నాడు. అతడికి ఫిట్స్ రావడం ఎవరూ గమనించకపోవడంతో సుధాకర్ మృతి చెందాడు. మృతుడు విద్యుత్‌శాఖలో రాజేశ్వరపురం సర్కిల్ పరిధిలోని మూటాపురంలో కాంటింజెంట్ వర్కర్ పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

మళ్లీ అదే రద్దీ..

- ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలించిన కమిషనర్



ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, మార్చి12: ఉచిత విద్యుత్‌కు సంబంధించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకునేందుకు దరఖాస్తుదారులు మంగళవారం నగరపాలకసంస్థ కార్యాలయానికి రావటంతో రద్దీ ఏర్పడింది. దీంతో కార్యాలయ ఆవరణలో టెంట్‌వేసి ఉచిత విద్యుత్‌కు సంబంధించిన వివరాలను దరఖాస్తుదారుల నుంచి తీసుకొని ఆన్‌లైన్ చేశారు.

ఆహార భద్రతాకార్డు, ఆధార్‌కార్డు వివరాలు సరిగా ఇవ్వకపోవటం, విద్యుత్‌శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగినప్పుడు పూర్తి వివరాలు నమోదు చేయకపోవటం తదితర కారణాలతో పలువురు దరఖాస్తుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో వారికి జీరో విద్యుత్‌బిల్లులు రాకపోవటంతో నగరపాలకసంస్థ కార్యాలయానికి వెల్లువెత్తారు. ఆధార్‌కార్డు, ఆహార భద్రతాకార్డు, కరెంట్ మీటర్ సంఖ్య కొందరు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవటంతో, సదరు దరఖాస్తులను తీసుకున్నారు. కాగా, ప్రత్యేక కేంద్రాల్లో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ భూఆక్రమణపై సర్వే

నేలకొండపల్లి, మార్చి12: మండల పరిధిలోని పైనంపల్లి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో స్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించుకున్నారని వచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. ఇటీవల మండలంలో పర్యటించిన రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు స్మశానవాటిక ఆక్రమణలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన మంత్రి విచారణ జరిపి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు పైనంపల్లిలోని స్మశానవాటిక స్థలాన్ని సర్వే చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీకి పాముకాటు

దుమ్ముగూడెం, మార్చి 12: తూరుబాకకు చెందిన చిట్టిమళ్ల దుర్గారాణి ఉపాధిహామీ పనులకు వెళ్లి పాముకాటుకు గురైంది. తూరుబాక గ్రామపంచాయతీలో భూ అభివృద్ధి పనులకు వెళ్లి ముళ్లపొదలు తొలగిస్తున్న సమయంలో తాచుపాము కాటేసింది. దీంతో ఆమె అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు ఆమెన భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

డీఎస్సీ ఎస్జీటీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 12: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఈబీసీ అభ్యర్థులకు డీఎస్సీ ఎస్జీటీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ శ్రీలత తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 22 వ తేదిలోగా www.tsbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. ఈ నెల 26 నుంచి శిక్షణ ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేష న్ ప్రకారం ఎస్జీటీకి సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా తీసుకుంటామన్నారు. 75 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9573859598, 9441931359 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రూ.1500 బుక్‌ఫండ్, స్టడీ మెటీరియల్‌కు..

డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఉచితంగా రూ.1500 బుక్‌ఫండ్, స్టడీ మెటీరియల్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులు టీచర్స్ (ఎస్జీటీ, స్కూల్ అస్టెంట్)లకు 10వేల మంది బీసీ అభ్యర్థులకు (7వేల మంది ఎస్జీటీలకు, 3వేల మంది స్కూల్ అసిస్టెంట్‌లకు) రూ.1500 చొప్పున బుక్ ఫండ్, స్టడీ మెటీరియల్ ఖర్చును అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన బీసీ అభ్యర్థు లు www.tsbcstudycircle.cgg.gov.in ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 5వ తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9573859598, 9441931359 నంబర్లలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఖమ్మం నగరంలోని బీసీ స్టడి సర్కిల్‌ను సంప్రదించాలని తెలిపారు.

బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణకు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిగ్రీ పాసైన అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా రెండు నెలల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ అందిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ శ్రీలత తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేటు బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్‌లు అందిస్తామన్నారు. గ్రాడ్యుయేట్ పూర్తిఅయి 26 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 25వ తేదిలోగా www.tsbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రాలలో ఈ నెల 31న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించటం జరుగుతుందని తెలిపారు. స్టడి సర్కిల్‌ను సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణ పర్యావరణ కమిటీ సభ్యురాలిగా వైరా వాసి



సరిత

వైరా, మార్చి 12: వైరాకు చెందిన పర్యావరణ రంగ నిపుణురాలు ఎస్.సరిత ను తెలంగాణ పర్యావరణరంగ నిపుణుల సలహా కమిటీ సభ్యురా లిగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నియమిం చింది. ఆమేరకు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఢిల్లీలోని ఒక ప్రముఖ తెలుగుమీడి యాలో బ్యూరోగా పనిచేస్తున్న తేలప్రోలు శ్రీనివాసరావు సతీమణి సరిత పర్యావరణలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ సాధించింది. దాదాపు రెండు దశాబ్దాల నుంచి పర్యావరణ రంగంలో పనిచేస్తున్న సరితను కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ తెలంగాణ పర్యావరణ నిపుణుల సలహా కమిటీ సభ్యురాలిగా నియమించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ నేషనల్ గ్రీన్‌కోర్ ప్రాజెక్టులో సరిత పనిచేసింది. ప్రస్తుత తెలంగాణ కమిటీలో చైర్మన్‌తోపాటు 14మంది సభ్యులుంటారు. వారిలో సరిత ఒకరు.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేవంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పం దించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

తేట 'తెల్లం'..

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌ను కలిశానని, అంతకుమించి రాజకీయ ఉద్దేశ్యం లేదని చెప్పుకుంటూ వచ్చారు. కానీ మరోవైపు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మార్చి 1న నిర్వహించిన మేడిగడ్డ పర్యటనకు ఎమ్మెల్యే తెల్లం గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఇటీవల బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశానికి కూడా హాజరు కాలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకులు ఎమ్మెల్యే తీరును అంచనా వేసి భద్రాచలం నియోజకవర్గ పార్టీ నాయకులకు భరోసా కల్పించారు.

ఇలాంటి పరిస్థితుల్లో మణుగూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో బహిరంగంగా భద్రాచలం ఎమ్మెల్యే పాల్గొనడం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. తాజా పరిణామాలను పరిశీలిస్తే కాంగ్రెస్‌తో తెల్లం మమేకమైనట్లేనన్న విషయం తేటతెల్లమవుతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తొలిరోజు నుంచే ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నాయంటూ జోరుగా ప్రచారం జరిగింది. ఆ ప్రచారాన్ని ఆయన ఖండిస్తూనే ఉన్నారు. కానీ తాజాగా సీఎం, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ప్రజాదీవెన సభలో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

అడవి పందిని తప్పించబోయి..



చికిత్సపొందుతున్న కూలీలు

నేలకొండపల్లి, మార్చి 12: ఆటోలో పరిమితికి మించి వ్యవసాయ కూలీలను తీసుకొని వెళుతున్న ఆటోకు అడవిపంది అడ్డురావడంతో డ్రైవర్ దాన్ని తప్పించే క్రమంలో ఆటో పల్టీ కొట్టి ఎనిమిది మంది కూలీలు గాయపడగా వారిలో ఒకరు మృతి చెందారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి న వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన 13మంది వ్యవసాయ కూలీలను ఎక్కించుకుని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం, గోపినేనిపాలెం గ్రామంలోని ఓ రైతు తోటలో మిర్చి ఏరటానికి తెల్లవారుజామునే బయలుదేరారు.

ఆటో బయలుదేరిన కొద్ది సేపటికే ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోకు అడవి పంది అడ్డం రావటంతో డ్రైవర్ దాన్ని తప్పించబోవడంతో ఆటో అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టినట్లు కూలీలు తెలిపారు. ఆటో పల్టీ కొట్టటంతో ఆటోలో ఉన్న కూలీల్లో 8మంది తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిలో పెద్దపంగు పార్వతి(50), దార్ల రాధమ్మ, కొత్తపల్లి జ్యోతి, పెద్దపంగు ఆరోగ్యం, దార్ల నాగమ్మ, సునీత, కందుల నర్సమ్మ, డ్రైవర్ దార్ల నాగేశ్వరరావు ఉన్నారు. వీరిని తొలుత నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం 108లో ఖమ్మం తరలించారు. వారిలో పెద్దపంగు పార్వతి ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి భర్త పెద్ద రాజు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

హామీని నిలబెట్టుకున్న మంత్రి పొంగులేటి

● సీఎం చేతుల మీదుగా మృతుడి భార్యకు 'ఇందిరమ్మ' ఇళ్ల పట్టా



మృతుడి భార్య సోడె సత్తెమ్మకు ఇంటి పట్టా అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అశ్వాపురం మార్చి 12: హామీ ఇచ్చిన విధంగానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగానే పథకం ప్రారంభం రోజునే మృతుని కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి పట్టా ఇప్పించారు. వివరాల్లోకి వెళితే.. అసెంబ్లీ ఎన్నికల ముందు మణుగూరులో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రోడ్ షో నిర్వహించారు. మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్‌షోకు హాజరయ్యేందుకు ట్రాక్టర్‌లో బయలు దేరారు. ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ కల్యాణపురం వద్ద పల్టీ కొట్టడంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న సోడె వెంకటేశ్వర్లు మృతిచెందాడు. అప్పట్లో మృతుని కుటుంబాన్ని పరామర్శించిన పొంగులేటి, ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు కొంత ఆర్థిక సహాయం అందజేయటమేకాక ప్రభుత్వం వస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చేతుల మీదుగా సత్తెమ్మకు ఇంటి పట్టా అందజేయటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎలక్టోరల్ బాండ్లనుంచి దృష్టి మరల్చేందుకే సీఏఏ

- మాస్‌లైన్ జాతీయ సంయుక్త కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 12: రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్లు విరాళాలను రద్దు చేస్తూ సు ప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఇప్పటి వరకు జారీ జరిగిన ఎలక్టోరల్ బాండ్ల వివ రాలను బహిర్గతం చేసేందుకు కార్పొరేట్ బ్యాంకులు ముందుకు రాని పక్షం లో దేశ వ్యాప్తంగా బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా చర్చ జరుగుతుంటే దేశ ప్రజల దృష్టిని మార్చేందుకే సీఏఏ 2019ను తెర మీదకు బీజేపీ తీసుకొచ్చిందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ సంయుక్త కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. 2019లోనే సీ ఏఏపై దేశ వ్యాప్తగా ప్రజలు నిరసనలు తెలపటంతో బీజేపీ ప్రభుత్వం మరుగున పెట్టిందని తిరిగి 2024లోక్‌సభ ఎన్నికల్లో రా జకీయ లబ్ధికోసమే ఇటువంటి కుయుక్తులు చేస్తోందని ఆయన ఆరో పించారు. ఈ మేరకు మంగళవారం పోటు రంగారావు ఖమ్మంలో మాస్‌లైన్ పొలిట్ బ్యూరో తరుపున ఓ ప్రకటన విడుదల చేశారు. సీఏఏ 2019 నోటిపికేషన్‌ను మాస్‌లైన్ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. మతాలపరంగా పౌరసత్వాన్ని ఇచ్చేందుకు ఏర్పాటు చేసి న నిబంధనలను మాస్‌లైన్ వ్యతిరేకి స్తుందని జాతీయ పోరాటాలకు సిద్దంగా ఉన్నా మని ప్రజల మధ్య జీవించే హక్కు చిచ్చును పెట్టొద్ద ని ఆక్షేపిం చారు. రాజ్యాంగం సూత్రాలకు సీఏఏ వ్యతిరేకమని ఖం డించారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తుల కోసం, బీజేపీ దుష్ట కూటమిలను మాస్‌లైన్ తిప్పికొడుతోందన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండు సార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్ల ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలావుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

కాంగ్రెస్ ద్వారానే అన్ని వర్గాలకు మేలు: పొంగులేటి ప్రసాదరెడ్డి

తిరుమలాయపాలెం, మార్చి12: కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కాకరవాయి, పైనంపల్లి, జూపెడ, తిరుమలాయపాలెం, పాతర్లపాడు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల వారికి తీరని అన్యాయం జరిగిందని, సంక్షేమ పథకాలుకూడా పేదలకు అందలేదని, సంపన్న వర్గాల వారికే బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. ఈకార్యక్రమంలో రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, జడ్పీటీసీ బెల్లం శ్రీను, ఎంపీపీ బోడ మంగిలాల్, ఉన్నం రాజశేఖర్, కర్నాటి శ్రీను, బత్తుల రవి, ఎస్.ఉపేందర్, నాగేశ్వరరావు, తాటికొండ కిరణ్, జడల నగేష్, గంధ్ర గోపాలరావు, గూడురు ఉపేందర్, వైస్ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, పాల్గొన్నారు.

యాసంగి సాగుకు సెలవు

- సాగర్‌లో నీరు లేక వ్యవసాయాన్ని వదిలేసిన అన్నదాత
- తల్లాడ మండలంలో రూ.120కోట్ల ఆదాయాన్ని కోల్పోయిన రైతులు




బీళ్లుగా మారిన పొలాలు, వట్టిపోతున్న ఎన్నెస్పీ సిరిపురం మేజర్ కాల్వ

తల్లాడ,మార్చి12: మండలంలో రైతులు యాసంగి సాగుకు సెలవు తీసుకున్నారు. ఫలితంగా రూ.120కోట్ల ఆదాయాన్ని కోల్పోయారు. తీవ్రవర్షాభావం, వాతావరణ ప్రతికూల పరిస్థితులు, నాగార్జున్ సాగర్ ప్రాజెక్టు జలాలు అడుగంటిపోవటంతో వేలాది ఎకరాల మాగాణి భూములు యాసంగి సాగుకు నోచుకోలేదు. దీంతో వ్యవసాయ భూములు ఎడారిని తలపిస్తున్నాయి. రైతులు సుమారు రూ.120కోట్లమేరకు ఆదాయాన్ని కోల్పోవాల్సి రావడంతో తల్లాడ మండలంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. యాసంగి సాగు నిల్చిపోవడంతో రైతులు, కూలీలకు ఉపాధి కరువై పశుగ్రాసానికి కూడా తీవ్ర కొరత ఏర్పడింది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో తల్లాడ మండలంలో ఎన్నెస్పీ, చెరువులు, ఎత్తిపోతల పథకాలు, చెక్‌డ్యాంలు, విద్యుత్ మోటార్ల కింద 18,256ఎకరాల మాగాణి, 917ఎకరాలు మెట్ట భూములు సాగుకు నోచుకోక ఖాళీగా ఉన్నాయి. గతఏడాది యాసంగి సీజన్‌లో 19491ఎకరాల్లో వరి, 1089ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. సగటున వరి ఎకరాకు 25క్వింటాళ్ళ, మొక్కజొన్న 35క్వింటాళ్ల చొప్పున దిగుబడులు వచ్చాయి. కాగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగుచేయకపోవడంతో సుమారు 4.56లక్షల క్వింటాళ్ల ధాన్యం, 32వేల క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడులను రైతులు కోల్పోయినట్లయింది. ఎకరాకు ఒక ట్రాక్టర్ ట్రక్కు 60నుంచి 80దిండ్లు చొప్పున వరిగడ్డిని కూడా కోల్పోవాల్సి వచ్చింది. ధాన్యం ద్వారా రూ.వందకోట్ల, 32లక్షలు, వరిగడ్డి ద్వారా రూ.10.95కోట్లు, మొక్కజొన్న ద్వారా రూ.9.60కోట్ల మేరకు ఆదాయాన్ని రైతులు కోల్పోయినట్లయింది. వరి, మొక్కజొన్న సాగు ద్వారా పొందే ఆదాయాన్ని కూలీలు కూడా కొంతమేరకు కోల్పోయారు. బియ్యం, పశుగ్రాసానికి మరింత డిమాండ్ పెరిగి ప్రజలపై అదనపు భారం పడే అవకాశముంది.

పదెకరాల మాగాణి ఖాళీగా ఉంది

దుగ్గినేని వెంకటేశ్వర్లు, రైతు, అన్నారుగూడెం



ఎన్నెస్పీ ఆయకట్టు కింద నాకున్న పదెకరాల మాగాణి భూమి ఖాళీగా ఉంది. గత యాసంగిలో వరి సాగు చేస్తే ఎకరాకు 25క్వింటాళ్ల చొప్పున ధాన్యం దిగుబడి వచ్చింది. పెట్టుబడులు పోను యాసంగి వరిసాగు లాభసాటిగా ఉండేది. ఇప్పుడు సాగునీరు లేక ఖాళీగా ఉండటంతో ఆర్థికంగా నష్టపోయాను.

పశుగ్రాసానికి తీవ్ర కొరత ఉంది

నల్లమోతు మోహన్‌రావు, రైతు, గోపాలపేట



ఎన్నెస్పీ ఆయకట్టు కింద నాకు మూడెకరాల మాగాణి ఉంది. సాగు నీరు లేకపోవడంతో యాసంగిలో వరి వేయకుండా వదిలేశాము. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో వేలాది ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. దీనివల్ల ధాన్యానికి, పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసాన్ని పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలి.

ఆస్తిపన్నుల లక్ష్యం పూర్తయ్యేనా?

- లక్ష్యం రూ.31.12కోట్లు, వసూళ్లు రూ.21కోట్లు
- రోజుకు రూ.30లక్షలు వసూలు చేయాలని నిర్ణయం




పన్నుల వసూళ్లను పర్యవేక్షిస్తున్న సహాయ కమిషనర్, మైక్ ద్వారా ప్రచారం

ఖమ్మంకార్పొరేషన్, మార్చి12: ఈ ఆర్థిక సంవత్సరం మరో 18రోజుల్లో ముగియనుండగా, నగరపాలకసంస్థకు ఈ సారి ఆస్తిపన్నుల ద్వారా ఆదాయం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. నగరపాలకసంస్థలోని రెవెన్యూ అధికారులకు, బిల్‌కలెక్టర్లు తదితర ఉద్యోగులకు ఇతర బాధ్యతలు అప్పగించటంతో ఆస్తిపన్నుల వసూళ్లు మందగించాయి. మార్చి 31నాటికి ఆస్తిపన్నుల ద్వారా రూ.30.12 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు రూ.21.05కోట్లు వసూలు అయ్యాయి. మరో 18రోజుల్లో రూ.9కోట్ల వరకు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల కోడ్ వస్తే నగర పాలకసంస్థ ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగిస్తారు. దీంతో ఆస్తిపన్నులు వసూళ్ల లక్ష్యం నెరవేరుతందా? అన్న అనుమానాలు వస్తున్నాయి.

రోజుకు రూ.30లక్షలు వసూలు లక్ష్యం

అస్తిపన్నులు రోజుకు రూ.30లక్షలు వసూలు చేయాలని నిర్ణయించారు. కానీ ఆ మేరకు వసూళ్లు జరగటం లేదు. రెవెన్యూ ఉద్యోగులకు అదనపు పనులు అప్పగించటంతో వారు అసలు విధులైన పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టలేకపోయారు. ఫలితంగా ఆస్తిపన్నుల వసూళ్లు మందగించాయి. అంతేకాకుండా ఆర్ఐలుగా వేరే విభాగాలకు చెందినవారిని నియమించటంతో వారు పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నారు.

అన్నింటికీ రెవెన్యూ ఉద్యోగులే...

నగరపాలకసంస్థ పరిధిలో ఏ పని చేయాలన్నా రెవెన్యూ ఉద్యోగులకే బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఓటర్ల జాబితా పరిశీలన, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన. తనిఖీలు తదితర పనులను రెవెన్యూ ఉద్యోగులకు అంటగట్టడంతో అసలు విధులు చేయలేకపోతున్నారు. ఆర్ఐలు ముగ్గురు మాత్రమే ఉన్నప్పటికీ బిల్‌కలెక్టర్లు సరిపడా ఉన్నారు. అయినప్పటికీ వేరే విధులు కేటాయించటంతో పన్నుల వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇక లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు వస్తే మళ్లీ ఎన్నికల విధులు ఇస్తారని, ఆస్తిపన్నులు ఎలా వసూలు అవుతాయనే ఆందోళన రెవెన్యూ ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నది.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, మార్చి12: మండలంలోని రామానగరం, యాతాలకుంట, చెరుకుపల్లి గ్రామ పంచాయితీలలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మంగళవారం పర్యటించారు. రూ.89లక్షతో రామానగరం, యాతాలకుంట గ్రామాలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు అదేవిధంగా చెరుకుపల్లి గ్రామ పంచాయితీలోని తురకలగూడెం ప్రాథమిక పాఠశాలలో రూ.5.8లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా హైమావతి శంకరరావు, ఎంఈఓ బీ.రాములు, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు: మండలంలోని చౌడారం, కందుకూరు, భరణిపాడు గ్రామాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే రాగమయి మంగళవారం ప్రారంభించారు.



తురకలగూడెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, కుక్కపల్లి శ్రీనివాసరావు, నాగులు, నాను, రాములు, గడిపర్తి శ్రీనివాసరావు, అట్లూరి సత్యనారాయణ రెడ్డి, కోట సత్యనారాయణ, రంగారెడ్డి పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళాలు

ఖమ్మంఖానాపురంహవేలి మార్చి 12: కైకోండాయిగుడెం ప్రధాన రహదారి వెంట నూతనంగా నిర్మిస్తున్న అంకమ్మ, మహాలక్ష్మమ్మ, ముద్దిరావమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం పలువురు విరాళాలు అందించారు. ఖమ్మం నగరానికి చెందిన నవీనా గ్రానైట్ యజమాని వేముల రవికుమార్, వాణి దంపతులు రూ.50,116, కైకోండాయిగుడేనికి చెందిన కొండపర్తి నారాయణ, నాగేశ్వరి దంపతులు రూ.25,116, బల్లేపల్లికి చెందిన మట్టా మురళీకృష్ణ, జ్యోతి దంపతులు 10,116, బానోత్ వెంకన్న ఉమా దంపతులు 10,116, బాలాజీ గ్రానైట్ యజమాని అజ్మీరా కిషోర్, రూపావతి దంపతులు 10,116, 55వ డివిజన్ కార్పోరేటర్ మోతారపు శ్రావణి, సుధాకర్ దంపతులు రూ.10వేలు, గొడుగు నాగేశ్వరరావు, వెంకటలక్ష్మీ దంపతులు 10,116, తూము శేషయ్య, సునిత దంపతులు 10,116, వల్లభనేని శ్రీనివాసరావు, సీతాలక్ష్మి దంపతులు 5,116 విరాళాంగా అందించారు.

కమనీయం శ్రీవారి కల్యాణం

తల్లాడ: తల్లాడలోని హన్మత్ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణ మండపంలో సోమవారంరాత్రి శ్రీవారి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. మంగళవారం స్వామివారికి గోవింద పట్టాభిషేకం, గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దివి సీతారామాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం శేషగిరిరావు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని అభయాంజనేస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి శంకరరావు మంగళవారం ప్రారంభించారు. అన్న దానానికి సహకరించిన దాతలు వల్లభనేని పవన్, ప్రవీణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో బొంతు మాధవరావు, నాగళ్ల ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న చైర్మన్, ఎంపీపీ

30న సత్తుపల్లిలో రన్ ఫర్ జీసస్

సత్తుపల్లిరూరల్, మార్చి12: గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఈనెల30న సత్తుపల్లిలో నియోజకవర్గ స్థాయిలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం జరపతలపెట్టినట్లు తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపకులు ఎండీ.సుదర్శనం తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ నగర్ క్రీస్తుసంఘం ప్రార్ధనామందిరంలో సమావేశమయ్యారు. కార్యక్రమంలో అలవాల కరుణాకర్, జాన్‌మార్క్, గుర్రాల సత్యానందం, పింగిలి సామేలు, పిల్లి రవికిరణ్, పాల్‌రాజు, యోబు, వరప్రసాద్, ఐ.శ్రీనివాసరావు, కంచెపోగు దేవసహాయం, దానియేలు, ఏహిజగే పాల్గొన్నారు.

17న నెలనెల వెన్నెల

ఖమ్మం సాంస్కృతికం మార్చి 12: రంగస్థల సాంస్కృతిక కార్యక్రమం నెలనెల వెన్నెల భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 17న సాయంత్రం 6గంటలకు జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు ఎఎస్ కుమార్, మోటమర్రి జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య కళాభారతి కరీంనగర్ కళాకారులచే స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించనున్నారు.

సీసీ రహదారులకు శంకుస్థాపన

రఘునాథపాలెం, మార్చి12: మండల పరిధిలోని మంచుకొండ గ్రామానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంజూరు చేసిన సీసీ రహదారులను కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచి వాంకుడోత్ దీప్లానాయక్ శంకుస్థాపన చేశారు. భూక్య భద్రునాయక్, దంతబోయిన శ్రీను, భూక్య లింగా, లాల్‌జానీరసూల్, మేరా గుండేటి, హరినాథ్ పాల్గొన్నారు.

రాతోని లిప్టు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలి

పెనుబల్లి, మార్చి 12: రాథోని ఎత్తిపోతల పథకం పైపులైన్ పాడైపోవడంతో సుమారు 200 ఎకరాలకు నీరందడం లేదని రైతుల ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ కిరణ్‌కుమార్ పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.50వేలు ఖర్చవుతుందని అంచాన వేశారు. నీటిపారుదలశాఖ నుంచి నిధులు లేనందున మరమ్మతులు చేపట్టలేమని అధికారులు వివరించారు. తమ పంటలను కాపాడేందుకు ఎత్తిపోతల పథకం కమిటీ నిధులు మంజూరు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కొణిజర్ల, మార్చి12: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పరిశ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మలపల్లి ఉన్నత పాఠశాలలో పరిశ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. మండలంలోని పెద్దగోపతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఖమ్మం సీవిరామన్ జూనియర్ కళాశాల వారు పంపిణీ చేశారు.

రఘునాథపాలెం మండలంలో..

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి, పాపటపల్లి, కామంచికల్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. హెచ్ఎంలు లలిత భవాని, ప్రభాకర్, కాంపాటి మురళీ, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న పుల్లయ్య

కానిస్టేబుళ్ల ఆర్థిక సాయం



చెక్కును అందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, మార్చి12: అనారోగ్యంతో చనిపోయిన కానిస్టేబుల్ భూక్యా లోక్‌చంద్‌కు తోటి కానిస్టేబుళ్ల, పోలీసు అధికారులు వితరణ అందించారు. రూ.2.27 లక్షల చెక్కును మంగళవారం సీపీ సునీల్‌దత్ కానిస్టేబుల్ సతీమణి జ్యోతికి చెక్కును అందించారు.

కల్లూరులో పోలీసుల కవాతు

కల్లూరు, మార్చి12:కల్లూరు పట్టణంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నిలను దృష్టిలో ఉంచుకొని కల్లూరు డివిజన్ పరిధిలో గల కల్లూరు, పెనుబల్లి ఎస్ఐలు ఎస్కే షాకీర్, వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందస్తు జగ్రత్త చర్యలో భాగంగా సీఐఎస్ఎఫ్ చెందిన 90 మంది బలగాలతో ఈ కవాతు నిర్వంచారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగిరం చేయాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 12: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కాదాన్ని మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ ఆదేశించారు.. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. జిల్లాలో 10273 దరఖాస్తులు ధరణిలో పెండింగులో ఉండగా, మొత్తం 4180 దరఖాస్తులు పరిష్కరించినట్లు చెప్పారు. వీటిలో 2496 దరఖాస్తులు ఆమోదించగా, 1684 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. ఇంకా పెండింగులో ఉన్న దరఖాస్తులు యుద్ధప్రాతిపదికన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, తహసీల్దార్లు, ధరణి ఓఎస్డీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వీప్ కార్యక్రమాలను నిర్వర్తించాలి

స్వీప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. కలెక్టరేట్ లోని వీడియో



కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఆయన స్వీప్ కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఓటుహక్కు అర్హత ఉన్న ప్రతీఒక్కరు ఓటుహక్కు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటుహక్కుపై ప్రజల్లో ప్రచారం చేయాలని, దాని ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం చేయాలన్నారు.హై స్కూలు, కళాశాలల్లో మాక్ పోల్ చేపట్టి, అవగాహన కల్పించాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవ కేంద్రం తనిఖీ

ముదిగొండ,మార్చి12: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన సేవ కేంద్రాన్ని జడ్పీ సీఈవో వినోద్ మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, ఎన్ని ఆన్‌లైన్ చేశారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో సూర్యనారాయణ, ఏపీవో రంగనాయకమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీకి న్యాక్ ఏప్లస్ గుర్తింపు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి12: ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏప్లస్ గుర్తింపునిచిందని విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కళాశాలలో వసతులు, ప్రమాణాలను పాటించటంతో గతంలో ఉన్న బి ప్లస్ గుర్తింపు కంటే నేడు ఏ ప్లస్ గుర్తింపు రావటం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడామిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

నేడు మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి పర్యటన

మధిరటౌన్,మార్చి12: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం మధిరలో పర్యటించునున్నారు. మధ్యాహ్నం 3గంటలకు ఆయన భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి హెలికాప్టర్ ద్వారా మధిర రానున్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి, మధిర నుంచి అత్కూరు వరకు ఎంప్లాయిస్ కాలనీ మీదుగా నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మధిర ట్యాంక్‌బండ్ వద్ద రూ.10కోట్లతో చేపట్టనున్న ట్యాంక్ బండ్ విస్తరణ పనులు, నిధానపురం వరకు చేపట్టనున్న నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను సీఐ మధు, ఎస్ఐ సంధ్యా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ షఫీఉల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పరిశీలించారు.

తిరుమలాయపాలెంలో మంత్రి పొంగులేటి..

తిరుమలాయపాలెం, మార్చి12: రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారని అనంతరం జరిగే సభలో ప్రసంగిస్తారన్నారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి12: హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో మంగళవారం జరిగిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సభకు ఖమ్మం నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈసభకు సుమారు 20 బస్సులలో కార్యకర్తలు, నాయకులు వెళ్లారు. ఈకార్యక్రమాన్ని జిల్లా కార్యాలయంలో వద్ద జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

నేలకొండపల్లి: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విజయ్‌సంకల్ప యాత్రకు నేలకొండపల్లి మండలం నుంచి భారీ సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు తరలివెళ్ళారు. మండలానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, పాగర్తి సుధాకర్, కోటి హనుమంతరావు, షేక్. షర్ఫుద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం, బాజా రామకృష్ణ, కందరబోయిన వెంకటరమణ, తోగటి నాగాచారి, గెల్లా చక్రపాణి తదితరులు హైదరాబాద్ వెళ్ళినవారిలో ఉన్నారు.



ఖమ్మం నుంచి సభకు వెళుతున్న బీజేపీ శ్రేణులు

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఖమ్మంఖానాపురంహవేలి మార్చి 12: మహిళల హక్కులు గురించి ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మేయర్ పునుకోల్లు నీరజ, ట్రెయినీ ఐపీఎస్ మౌనిక అన్నారు. మంగళవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. 40 మంది ఉత్తమ మహిళా ఉద్యోగులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమి జోహర, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి పాల్గొన్నారు.

కొందరికే 'జీరో' బిల్లులు

- లబోదిబోమంటున్న విద్యుత్ వినియోగదారులు
- బిల్లు నమోదుకాని వినియోగదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- సత్తుపల్లి డివిజన్‌లో మొత్తం విద్యుత్ వినియోగదారులు 51,864మంది

సత్తుపల్లిరూరల్, మార్చి12: గృహజ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల వరకు ఉపయోగించే వారికి జీరో విద్యుత్ బిల్లు ఇస్తున్నట్లు ప్రకటించగా, ఆ బిల్లులు నమోదుకానీ వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. వీరంతా సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయంతో పాటు గ్రామాలలో వినియోగదారులు ఎంపీడీవో కార్యాలయాలలో ఆన్‌లైన్ చేయించుకోవాలని అధికారులు సూచించారు.దీంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు వినియోగదారులు. విద్యుత్ బిల్లుల సర్వీస్ నంబర్‌కు ఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో రేషన్ కార్డు నంబర్‌ను జతపరిచినట్లయితే ఈనెల కాకపోయినా వచ్చే నెల బిల్లులో జీరో బిల్లుగా జనరేట్ అయ్యే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగదారులు అయోమయానికి గురికావద్దని, వచ్చే నెల బిల్లులో జీరో బిల్లు వస్తుందని డీఈఈ రాములు తెలిపారు.

అయోమయంలో విద్యుత్ వినియోగదారులు

ప్రభుత్వం యంత్రాంగం ఎక్కడికక్కడే హెల్ప్‌డెస్కులు ఏర్పాటుచేసి దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రజాపాలన విద్యుత్ మీటర్ నంబర్ తప్పుపడితే మాత్రమే రేషన్, ఆధార్ కార్డ్, మొబైల్ నంబర్ ద్వారా సరిచేస్తున్నారని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు, నమోదు కానీ వారి పరిస్థితి ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.



సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తుదారులు

డివిజన్‌లో అప్‌లోడ్ కానీ ధరఖాస్తులు 2026.

మంగళవారం వరకు పరిశీలిస్తే సత్తుపల్లిలో నమోదు కాని లబ్ధిదారులు సుమారు 266మంది ఉండగా 225వారి సర్వీస్ నంబర్లను అప్‌లోడ్ చేయగా కొత్తగా 15దరఖాస్తులు వచ్చాయి. సత్తుపల్లి ఎంపీడీవో కార్యాలయానికి 333దరఖాస్తులు రాగా 224సరిచేయగా కొత్తగా 7దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇలా డివిజన్‌లోని ఈనెల 11వరకు గృహజ్యోతి ధరఖాస్తులు వచ్చినట్లు డీఈ చెప్పారు.